RNI. No. APTEL/2011/41055






# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక






సంపుటి : 12 సంచిక : 251 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శుక్రవారం, 15 మార్చి 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# త్వరలో కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు

**రేషన్ కార్డులతో సంబంధం లేకుండా ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయం**

**ఆదాయంతో నిమిత్తం లేకుండా అందరికీ పథకం వర్తింప చేసే చాన్స్!**

**అదనంగారూ.400 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా**

**కొత్తగా మరిన్నిశస్త్రచికిత్సలు చేర్చాలని వైద్య,ఆరోగ్యశాఖ నిర్ణయం..**



**రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ లబ్దిదారులకు కొత్తగా కార్డులివ్వాలని నిర్ణయించింది. ప్రతి కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకొని యూనిక్ నంబర్‌తో కార్డులు ఇవ్వనుంది. కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ ఒక్కో సబ్ నంబర్ ఇస్తారు. ఇదే కార్డును హెల్త్ ప్రొఫైల్‌కు లింక్ చేసి, స్టేట్ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌ను తయారు చేస్తారు. ఈ మేరకు ఆరోగ్యశ్రీ ట్రస్టు కసరత్తు చేస్తోంది.**

హైదరాబాద్: రాష్ట్రంలో ఇప్పటివరకు కొందరు పేదలకు ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నాయి. అంతేకాకుండా అనేకమంది తెల్ల రేషన్‌కార్డును ఆధారం చేసుకొనే ఆరోగ్యశ్రీ సేవలు పొందుతున్న సంగతి తెలిసిందే. ఇక నుంచి ఆరోగ్యశ్రీకి రేషన్ కార్డుకు లింకు పెట్టకూడదని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల జారీ అంశంపై ఆరోగ్యశ్రీ ట్రస్టు దృష్టిసారించింది. ఈ మేరకు లబ్దిదారుల గుర్తింపుపై మార్గదర్శకాలు రూపొందిస్తోంది. అందరికీ ఆరోగ్యశ్రీని వర్తింప చేస్తే ఎలా ఉంటుందన్న దానిపై వైద్య, ఆరోగ్యశాఖ కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కోసం ఏటా రూ.1,100 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అందరికీ వర్తింప చేయడం వల్ల అదనంగా రూ.400 కోట్ల భారం పడే అవకాశం ఉందని, ఇది పెద్ద భారం కాదన్న భావనలో సర్కారు ఉంది. మధ్యతరగతి ప్రజల్లో చాలామందికి, ఉద్యోగులకు, ఇతరులకు పలు పథకాలు ఉన్నాయి. అలాగే ప్రైవేట్ ఆరోగ్య బీమాతో ఆరోగ్య సేవలు పొందుతున్న వారూ చాలామంది ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ కార్డులతో అందరికీ సార్వజనీన ఆరోగ్య సేవలు అందించవచ్చని సర్కారు యోచిస్తోంది.

**వంద శస్త్రచికిత్సలు చేర్చే అవకాశం** : రాష్ట్రంలో 293 ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులు, 198 ప్రభుత్వ పెద్దాసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయి. అలాగే గత ఏడాది 809 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)లోనూ ఆరోగ్యశ్రీ కింద సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. మొత్తంగా రాష్ట్రంలో 1,310 ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్యశ్రీకి అర్హులుగా 77.19 లక్షల మంది పేదలు ఉన్నారు. ఉద్యోగులు, జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని కూడా ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అమలు చేస్తున్నారు. లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులు, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఈజేహెచ్‌ఎస్ కిందకు వస్తారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కింద 1,376 శస్త్రచికిత్సలు, 289 వైద్య సేవలున్నాయి. ఆయుష్మాన్ భారత్ కింద 1,949 వ్యాధులకు వైద్యం అందుతోంది. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌లో ఈ రెండింటిలో ఉన్న వ్యాధులను కలిపి అమలు చేస్తున్నారు. వీటికి సుమారు మరో వంద శస్త్రచికిత్సలను చేర్చే అవకాశం ఉంది.

**ఒక్కో కుటుంబానికి 10 లక్షల కవరేజీ** : ఆయుష్మాన్ భారత్ పథకం కింద కేంద్రం 2022లో ప్యాకేజీలను సవరించింది. గతంలో ఆరోగ్యశ్రీ కింద కవరేజీ రూ. 2 లక్షలు ఉండగా, ఆయుష్మాన్ భారత్ పథకం రావడంతో దాన్ని రూ. 5 లక్షలు చేశారు. కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రూ.10 లక్షలు చేసిన సంగతి తెలిసిందే. ఏడాదికి ఈ పథకాల కింద ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షల వరకు కవరేజీ వర్తిస్తుంది. దీనికి ప్యాకేజీ సొమ్ము కూడా పెంచితే ఏటా రూ.1,500 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**ఈహెచ్‌ఎస్ పథకంపై తేలని నిర్ణయం** : ఈహెచ్‌ఎస్ పథకంపై ఉద్యోగులు కంట్రిబ్యూషన్ ఇస్తామని పేర్కొన్న సంగతి విదితమే. గత అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌కు ముందు రోజు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంప్లాయి హెల్త్ కేర్ ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) ఏర్పాటు చేసి అమలు చేయాలని నిర్ణయించింది.

పథకం అమలుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేసి ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి కొంత మొత్తాన్ని, అంతే మొత్తంలో ప్రతి నెలా ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌గా జమ చేయాలని పేర్కొన్నది. ఈ మేరకు తమ మూల వేతనంలో ఒక శాతం కాంట్రిబ్యుషన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వానికి గతంలో విజ్ఞప్తి చేశాయి. ఆసుపత్రుల్లో తమకు వైద్యం అందనందున ఈ ప్రక్రియకు ఉద్యోగులు కూడా ముందుకు వచ్చారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం దీనిపై ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అంటున్నారు.

# నేడు హైదరాబాద్‌లో ప్రధాని మోదీ రోడ్ షో

హైదరాబాద్: భాగ్యనగరం వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఎన్నికల నగారా మోగనుందనే సంకేతాల నేపథ్యంలో ప్రధాని మోదీ.. ఈ నెల 15న మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో ప్రచారపర్వానికి శ్రీకారం చుట్టనున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధించాలని భావిస్తున్న భారతీయ జనతాపార్టీ..మల్కాజ్‌గిరి స్థానంపై ప్రత్యేక దృష్టి సారించింది. సిట్టింగ్ సికింద్రాబాద్ స్థానం సహా మల్కాజ్‌గిరి, చేవెళ్ల, హైదరాబాద్ స్థానాలపై ఫోకస్ పెట్టిన కమలదళం..ప్రచారపర్వంలోకి జాతీయ నేతలను రంగంలోకి దించుతోంది.

రెండు రోజుల క్రితం హోం మంత్రి అమిత్‌షా నగరంలో పర్యటించగా..పది రోజుల వ్యవధిలోనే ప్రధాని రెండోసారి రాష్ట్రానికి వస్తుండడం గమనార్హం. ఇటీవల నగర శివార్లలోని పటాన్‌చెరులో జరిగిన బహిరంగ సభలో మోదీ పాల్గొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే లోక్‌సభ ఎన్నికలకు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ నగర ఓటర్లను ఆకట్టుకునేందుకు రోడ్‌షోలు నిర్వహిస్తోంది. మల్కాజ్‌గిరిలో సుమారు 5 కిలోమీటర్ల మేర ప్రధాని రోడ్ షో నిర్వహించేలా కార్యక్రమాన్ని రూపొందించింది.

**పీఎం పర్యటన నేపథ్యంలో ఆంక్షలు...** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో పోలీసులు పలు ఆంక్షలు విధించారు. ఈ నెల 15న మల్కాజ్‌గిరిలో జరగనున్న సభలో మోదీ పాల్గొననున్నారు. దీంతో మీర్జాల్‌గూడ నుంచి మల్కాజ్‌గిరి క్రాస్ రోడ్ వరకు 5 కి.మీ. మేర పారా



గ్లైడర్లు, రిమోట్ కంట్రోల్ డ్రోన్‌లు, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను ఎగరవేయడానికి అనుమతి లేదని రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్ జోషి ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఐపీసీ సెక్షన్ 188, 121, 121 (ఏ), 287, 336, 337, 338 కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




**కేసీఆర్ బై బై.. కాంగ్రెస్‌లోకి మల్లారెడ్డి! ప్రియాంక అపాయింట్మెంట్ కోరిన బీఆర్ఎస్ నేతలు**

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు భారీ షాక్ తగలబోతోందా. అంటే అవుననే సంకేతాలు ఇస్తున్నాయి తాజా పరిణామాలు. పార్టీకి ఎంతో నమ్మిన బంటుగా ఉండే మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత మల్లారెడ్డి త్వరలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు.

ఇప్పటికే కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ని మల్లారెడ్డి, మరో నేత మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం కలిసినట్లు తెలుస్తోంది. బెంగళూరులోని ఓ హోటల్లో డీకే శివకుమార్‌తో మంతనాలు జరిపారు. కాంగ్రెస్‌లో చేరేందుకు ఇరువురు దాదాపు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో మల్లారెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అపాయింట్మెంట్ కోరారు. దీన్ని బట్టి అతి త్వరలోనే మల్లారెడ్డి కాంగ్రెస్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఎన్నికల షెడ్యూల్ నుంచి కవిత కేసు విచారణ దాకా..




ఈ శుక్రవారాన్ని (15/03/24) దేశ రాజకీయాల్లో 'బిగ్ ఫ్రైడే'గా పరిగణించడంలో అతిశయోక్తి లేదు. ఎందుకంటే.. ఈ శుక్రవారం దేశవ్యాప్తంగా కొన్ని అనూహ్య పరిణామాలు చోటు చేసుకోనున్నాయి. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ దగ్గర నుంచి సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కేసు విచారణ దాకా.. కొన్ని కీలక ఘట్టాలు ఉండనున్నాయి. అవేంటంటే..

**సార్వత్రిక ఎన్నికలతో పాటు వివిధ రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం**

**సుప్రీంకోర్టులో ఎన్నికల కమిషనర్ల నియామకం కేసు విచారణ**

**ఎలక్టోరల్ బాండ్స్ వివరాలను బహిర్గతం చేయనున్న కేంద్ర ఎన్నికల కమిషన్**

**సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కేసు విచారణ**

**కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం.. లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణ కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన.. నూతన చేరికలు ఉండే అవకాశం**

**ఎవరి అంచనాలు వారివే..! :** సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ కోసమైతే ప్రతి ఒక్కరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈసారి బీజేపీ, ఇండియా కూటమిల మధ్య హోరాహోరీ పోరు కొనసాగనుండగా.. తాము ఈసారి మునుపటి కంటే ఎక్కువ సీట్లతో అఖండ విజయం సాధిస్తామని బీజేపీ ధీమా వ్యక్తం చేస్తోంది. తమ ఒక్క పార్టీనే 370 స్థానాలు కైవసం చేసుకుంటుందని, ఎన్డీఏ 400కి పైగా సీట్లు గెలుపొందుతుందని నమ్మకం వెలిబుచ్చుతోంది. అటు.. కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా కూడా తామే గెలుస్తామని ఉద్ఘాటిస్తున్నారు. దీంతో.. ఈ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది.

**ఏపీ పొలిటికల్ సినిమా..! :** ఏపీ రాజకీయాల విషయానికొస్తే.. టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు రంగంలోకి దిగుతుండగా.. వైసీపీ మునుపటిలాగే సింగిల్‌గా పోటీ చేస్తోంది. వైనాట్ 175 నినాదంతో సిద్ధమంటూ వైసీపీ ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టగా.. వైసీపీ వైఫల్యాల్ని ప్రజల్లో ఎండగడుతూ ప్రతిపక్ష పార్టీలు దూసుకుపోతున్నాయి. ఇరువర్గాల వాళ్లు పోటీపడి మరీ వాగ్ధానాలు చేస్తున్నారు. దీంతో.. ఈ పోరులో నెగ్గేదెవరన్నది ఉత్కంఠభరితంగా మారింది. ప్రతిపక్ష కూటమికి అనుకూల గాలులు వీస్తున్నా.. వైసీపీని తక్కువ అంచనా వేయలేమని విశ్లేషకులు చెప్తున్నారు.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# ఎన్నికల వేళ హెలికాప్టర్లకు డిమాండ్ అద్దె ఎంతో తెలుసా?

ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా అసెంబ్లీ ఎన్నికలతోపాటు పార్లమెంటుకు ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హెలికాప్టర్లకు, చాపర్లకు ఎక్కడ లేని డిమాండ్ నెలకొంది. ఆయా పార్టీలు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించాలన్నా, రోజుకు రెండు మూడు సభల్లో పాల్గొనాలన్నా హెలికాప్టర్ల అవసరం ఉంటుంది. హెలికాప్టర్లు అయితే గంటలోపుగానే రాష్ట్రం నలుమూలలకు వెళ్లిపోవచ్చు. దీంతో సమయం పెద్ద ఎత్తున కలిసి వస్తుంది. ఈ నేపథ్యంలో హెలికాప్టర్లకు మాండ పెరిగిపోయింది. అధికార, ప్రతిపక్ష పార్టీ ముఖ్య నేతలతో పాటు మధ్యలో వచ్చే జాతీయ నాయకులతోనూ ప్రచారం హోరెత్తించేందుకు అన్ని పార్టీలూ ఇదే మంత్రాన్ని జపిస్తున్నాయి. ఇలా తక్కువ సమయంలో ఎక్కువ నియోజకవర్గాల్లో పర్యటించేందుకు అవకాశం ఉన్న ఏకైక సాధనం హెలికాప్టర్. దీంతో వీటికి ఎన్నికల వేళ డిమాండ్ ఏర్పడింది. మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో హెలికాప్టర్లను అద్దెకిచ్చే కంపెనీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం హెలికాప్టర్ కు గంటకు రూ. 1.50 లక్షలు నుంచి రూ. 2 లక్షల వరకు అద్దె ఉంది. అలాగే చాపర్లకు గంటకు రూ. 4.50 లక్షల నుంచి రూ. 5.50 లక్షల వరకు ఉంది. 2019 ఎన్నికల సమయంలో ఒక్కో హెలికాప్టర్ కు గంటకు అద్దె రూ. 55 వేలు నుంచి రూ. 1.30 లక్షల వరకు ఛార్జీ చేసేవారు. ఇప్పుడది ట్రిబుల్ రేటు అయిపోయింది. హెలికాప్టర్ రకాన్ని బట్టి గంటకు రూ. 2 లక్షల నుంచి రూ. 3.50 లక్షల వరకు పార్టీలు చెల్లిస్తున్నాయి. ఇవిచాలవన్నట్టు విమానాశ్రయ ఛార్జీలు, ఎయిర్ పోర్ట్ హ్యాండ్లింగ్ ఛార్జీలు, ఫ్యూయల్ ట్రాన్స్ పోర్టేషన్, సిబ్బంది బస, ఆహారానికి అయ్యే ఖర్చు అదనం కావడం గమనార్హం. ప్రస్తుతం మన దేశంలో 350 చార్టర్డ్ విమానాలు, 175కు పైగా హెలికాప్టర్లు ఉన్నట్టు సమాచారం. ముంబయికి చెందిన ప్రైవేటు ఛార్టర్ కంపెనీ ఫ్లయింగ్ బర్డ్స్ ఏవియేషన్ కు నాలుగు హెలికాప్టర్లు, ఆరు జెట్ విమానాలున్నాయి. ఎన్నికల నేపథ్యంలో మరో కొన్ని హెలికాప్టర్లను అద్దెకు తీసుకుని అట్టిపెట్టుకుంది. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో సగటున 70-100 హెలికాప్టర్లకు డిమాండ్ ఉండేది. కానీ 40 మాత్రమే అప్పట్లో అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది హెలికాప్టర్ల డిమాండ్ 100-130కి పెరిగింది. అయితే కేవలం 50-60 విమానాలు మాత్రమే సమకూర్చగలుతున్నామని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. హెలికాప్టర్ల సంఖ్య తక్కువగా ఉండడం, డిమాండ్ ఎక్కువగా ఉండడంతో హెలికాప్టర్ల అద్దె ధరలు సైతం పెరిగాయి.

# కబేళా కథ.. మళ్లీ మొదటికి



హైదరాబాద్: జియాగూడలోని కబేళా అభివృద్ధి ప్రాజెక్టు మళ్లీ మొదటికొచ్చింది. ఆరేళ్ల కిందట అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. పీపీపీ పద్ధతిలో స్థానిక వ్యాపారుల భాగస్వామ్యంతో నిర్మాణ పనులు చేపట్టేందుకు జీహెచ్ఎంసీ అనేక ప్రయత్నాలు చేసింది. ఏళ్ల తరబడి అక్కడ జీవనోపాధి పొందుతున్న కుటుంబాలు, వ్యాపారులు, కార్మికులకు ప్రభుత్వ సంస్థతో అవసరమైన శిక్షణ, ధ్రువీకరణ పత్రాలను ఇప్పించింది. ఖర్చు భరించే విషయంలో స్థానిక వ్యాపారుల నిరాసక్తతతో పీపీపీ ప్రాజెక్టు రద్దయింది. ఉన్న కబేళాను అలాగే కొనసాగనివ్వండి లేదా మీరే భవనాలను నిర్మించండని స్థానికులు తేల్చి చెప్పడంతో.. సొంత నిధులతో పనులు చేపట్టాలని జీహెచ్ఎంసీ తాజాగా కొత్త ప్రణాళికను రూపొందించింది.

జియాగూడతో మూసీ కాలుష్యం

నగరానికి సరఫరా అయ్యే మాంసంలో జియాగూడ కబేళాలో రోజూ 6వేల జీవాలను వధిస్తారు. ప్రక్రియ మొత్తం నేలపై జరుగుతుంది. రక్తం మడుగులో, మట్టి నేలపై జంతువులను వధించి, చర్మాన్ని తొలగించడం వంటి పద్ధతులతో మాంసంపై క్రిములు చేరుతాయనేది వైద్యుల ఆందోళన. అశాస్త్రీయ పద్ధతుల్లో జంతువులను వధించి మాంసం దుకాణాలకు సరఫరా చేయడంతో ప్రజారోగ్యం దెబ్బతింటుంది. జంతు వ్యర్థాలను పక్కనే ఉన్న మూసీలో పడేయటంతో కాలుష్యం పెరుగుతోంది. ఆయా పరిస్థితులను రూపుమాపాలని గత సర్కారు జులై 4, 2018న రూ. 42.5 కోట్లతో పీపీపీ పద్ధతిలో ఆధునిక కబేళాను నిర్మించేందుకు పరిపాలనపరమైన అనుమతి ఇచ్చింది. అనంతరం ఇంజినీర్లు టెండరు ప్రక్రియను చేపట్టి, అనేకసార్లు స్థానికులతో టెండరు వేయించే ప్రయత్నం చేశారు. వ్యాపారులు ఖర్చు చేసేందుకు ముందుకు రాలేదు. బయటి సంస్థలకు నిర్వహణ బాధ్యతలు ఇస్తామంటే స్థానికులు ఒప్పుకోలేదు. దాంతో ప్రాజెక్టును రద్దు చేశామని, సొంత నిధులతో పనులు చేపట్టే ప్రతిపాదనను సిద్ధం చేశామని జీహెచ్ఎంసీ చెబుతోంది.

ఎలా కడతారంటే..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అంబర్‌పేట, బోయిగూడ, గౌలిపుర, రమ్నాస్‌పుర ప్రాంతాల్లో సుమారు రూ. 30కోట్ల వ్యయంతో అంతర్జాతీయస్థాయి కబేళాల నిర్మాణం జరిగింది. అప్పట్లో భారత్‌నుంచి విదేశాలకు రకరకాల మాంసం ఎగుమతి అయ్యేది. దాన్ని దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ విదేశాలనుంచి దిగుమతి చేసుకున్న యంత్రాలతో కబేళాలు నిర్మించింది. అనంతరం కేంద్రంలో ప్రభుత్వం మారడం, విదేశాలకు మాంసం ఎగుమతులపై నిషేధంతో.. ఆయా యంత్రాలన్నీ మరుగున పడ్డాయి. గతానుభవాలను దృష్టిలో ఉంచుకుని.. జియాగూడలో యంత్రాలు లేని కబేళాను నిర్మించాలని బల్దియా నిర్ణయించింది. ఎక్కడికక్కడ గదులు, నీటిని చిమ్మే పైపులైన్లు, వ్యర్థ జలాలను శుభ్రం చేసే కేంద్రాలను నిర్మించి.. ప్రజలకు నాణ్యమైన మాంసం సరఫరా అయ్యేలా ప్రణాళిక రూపొందించామని ఓ ఉన్నతాధికారి 'ఈనాడు'కు తెలిపారు.

జియాగూడ కబేళా ఇలా..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, హర్యానా, గుజరాత్, తమిళనాడు, కశ్మీర్ రాష్ట్రాలతో పాటు పాకిస్థాన్ నుంచి కూడా మేకలు, గొర్రెలు వేలాదిగా జియాగూడ మేకల మండికి వస్తుంటాయి.

మండి విస్తీర్ణం: 11ఎకరాలు

రోజూ జరిగే వధ: 6వేలు

నగరానికి సరఫరా అవుతోన్న మాంసంలోని వాటా: 80శాతం

# ఇచ్చేది అంతంతే.. నిండేది అరకొరే



పరిగి :గ్రేటర్‌లో అరకొర నీటి సరఫరాతో అనేక ప్రాంతాల్లో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కసారిగా సరఫరా తగ్గిపోవడంతో అపార్ట్‌మెంట్ వాసులు బెంబేటలెత్తుతున్నారు. ప్రధాన నగరం నుంచి అవుటర్ రింగ్‌రోడ్డు వరకు జలమండలి రోజు విడిచి రోజు నీటిని విడుదల చేస్తోంది. ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుల నుంచి 607 మిలియన్ గ్యాలన్లు(ఎంజీడీలు) తరలించేందుకు అవకాశం ఉన్నప్పటికీ... ఇప్పటికే 565 మిలియన్ గ్యాలన్లు సరఫరా చేస్తున్నారు. సాధారణ రోజుల్లో గంటన్నర, రెండు గంటల పాటు ఇచ్చేవారు. వేసవి దృష్ట్యా డిమాండ్ పెరగడంతో అనేక ప్రాంతాల్లో 45 నిమిషాలు నుంచి గంట వరకు అందిస్తున్నారు. దీంతో అపార్ట్‌మెంట్లలో సంపులు నిండటం లేదు. మళ్లీ సరఫరా కోసం 24-36 గంటల పాటు నిరీక్షణ తప్పడం లేదు. వేరే దారి లేక జలమండలి లేదంటే ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. జలమండలి ట్యాంకర్ బుక్ చేసిన మూడు-నాలుగు రోజులకు సైతం రావడం లేదని వాపోతున్నారు. మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్ లాంటి ఐటీ కారిడార్‌లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ప్రైవేటు ట్యాంకర్లు అధిక రేటు పెట్టి కొనుగోలు చేసినా సరే... ఆ నీళ్లు ఎలా ఉంటాయనే దానిపై వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జలమండలి పూర్తిస్థాయిలో క్లోరినేషన్ చేసి అందిస్తుంది. అదే ప్రైవేటు ట్యాంకర్లు మూసీ లేదంటే సమీప చెరువులు, ఖాళీ స్థలాల్లో బోర్లు వేసి అదే నీటిని విక్రయిస్తున్నారు. భూగర్భ కాలుష్యం, పరిశ్రమలు ఉన్న చోట ఈ జలాలు పూర్తిగా కలుషితమై ఉంటాయి. ఈ నీటిని స్నానం ఇతర అవసరాలకు వాడితే ప్రమాదం తప్పదని అంటున్నారు. ఇప్పటికైనా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెంచుకుంటే మేలు..

నగరానికి పక్కనే ఉన్న జంటజలాశయాల నుంచి ప్రస్తుతం 12-15 ఎంజీడీలను తరలిస్తున్నారు. మరో 10 ఎంజీడీల వరకు పెంచుకునే అవకాశం ఉంది.

కృష్ణా మూడు దశల నుంచి పూర్తి స్థాయిలో 270 ఎంజీడీలు తీసుకునే వెసులుబాటు ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నిత్యం 172 గోదావరి జలాలు తరలించడానికి జలమండలికి ఆస్కారం ఉంది. ఇందులో 60 ఎంజీడీల వరకు మిషన్ భగీరథకు తీసుకుంటున్నారు. దీనిలో 40 ఎంజీడీల వరకు నగరానికి తరలించాలని నగర ఇన్‌ఛార్జి మంత్రి సూచించారు. సింగూరు, మంజీరాల నుంచి 120 ఎంజీడీల వరకు తీసుకునే వెసులుబాటు ఉంది. ఇందులో కూడా కోత పడుతోంది. కోత లేకుండా ఈ ప్రాజెక్టుల నుంచి సరఫరా పెంచితే నగర నీటి కొరత తీరుతుంది. గ్రేటర్ వ్యాప్తంగా 72 ఫిల్లింగ్ కేంద్రాల పరిధిలో 650 ట్యాంకర్లు తిరుగుతున్నాయి. గతంలో 1200 వరకు ట్యాంకర్లు ఉండేవి. మరో 10-15 ప్రాంతాల్లో కొత్త ఫిల్లింగ్ కేంద్రాలు... అదనంగా ట్యాంకర్లు పెంచితే...బుక్ చేసిన 24 గంటల్లో నీటిని సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుంది.

# రేషన్ బియ్యంతో రక్తహీనతను అధిగమించొచ్చు: ఎన్ఐఎన్

హైదరాబాద్: రేషన్ బియ్యాన్ని నల్లబజారులో విక్రయిస్తున్నారా...? అయితే డబ్బు ఖర్చు చేయకుండా వచ్చిన పోషకాలను కోల్పోయినట్టే. కిలోకి రూ. 10 కోసం ఆ బియ్యాన్ని విక్రయిస్తే.. తర్వాత ఆసుపత్రుల్లో వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని పౌరసరఫరాల శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. జాతీయ పోషకాహార సంస్థ ఇదే విషయాన్ని మరోసారి స్పష్టం చేసింది. అవగాహన లేక కొందరు లబ్ధిదారులు ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యాన్ని నల్లబజారులో విక్రయిస్తున్నారు. దీంతో 'ఆహార భద్రత నుంచి పోషకాహార భద్రత' కల్పించాలన్న లక్ష్యం నీరుగారుతోంది. పౌరసరఫరాల శాఖ గతేడాది ఏప్రిల్ నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేపట్టి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ప్రతినెలా 17లక్షల కార్డుదారులకు 40వేల టన్నులపైగా పంపిణీ చేస్తోంది. అయితే ఇందులో ప్రతినెలా 10 నుంచి 15శాతం పేదల బియ్యం పక్కదారి పడుతోంది. దీనిని నియంత్రించేందుకు సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీ) చేపట్టినట్టు అధికారులు వెల్లడించారు.

అపోహలు వద్దు

చిన్నారులు, యుక్తవయస్కులు, గర్భిణుల్లో వరుసగా 67శాతం, 57శాతం, 52శాతం రక్తహీనత ఉన్నట్టు జాతీయ కుటుంబ సర్వే నివేదిక తెలపగా.. ఫోర్టిఫైడ్ బియ్యంతో ఈ సమస్యను అధిగమించొచ్చని ఎన్ఐఎన్ తెలిపింది. ఎన్ఐఎన్ డైరెక్టర్ డా. హేమలత నేతృత్వంలో శాస్త్రవేత్తల బృందం ఈ మేరకు ఒక శ్వేతపత్రాన్ని ఇటీవల విడుదల చేసింది. మహిళలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, పురుషులు తీసుకునే మొత్తం ఆహారంలో ఐరన్ వరుసగా 13 మిల్లీగ్రాములు, 13.23 మిల్లీగ్రాములు, 14.35 మిల్లీగ్రాములు, 15.19 మిల్లీగ్రాములు గ్రహిస్తున్నట్టు తేల్చింది.

ఆహారం.. బలవర్ధకం

పోషక విలువలు పెంచేందుకు కృత్రిమ విటమిన్లు కలిపి ఆహారాన్ని బలవర్ధకం చేయడాన్నే ఫోర్టిఫైడ్‌గా పరిగణిస్తారు. బియ్యాన్ని పిండిగా మార్చి.. దానికి ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి-12 వంటి విటమిన్లు, పోషకాలు కలిపి.. ఆ పిండిని బియ్యం రూపంలో కెర్నెల్స్‌గా మార్చుతారు. ప్రతి 99 కిలోల బియ్యానికి ఒక కిలో ఫోర్టిఫైడ్ బియ్యం కెర్నెల్స్ కలుపుతారు. సంచులో నింపి సనత్‌నగర్‌లోని ఎఫ్‌సీఐలో భద్రపరిచి.. రేషన్ దుకాణాలకు తరలిస్తున్నారు.



పోషకాలు ఎంతమేర కలుపుతారంటే..

28 నుంచి 42.5 మిల్లీగ్రాముల వరకు ఐరన్(ఫెర్రిక్ పైరోపాస్ఫేట్) కలుపుతారు. లేదా దీనికి బదులు సోడియం ఐరన్ 14 నుంచి 25.25 మి.గ్రాములుకలుపుతారు. 75 నుంచి 125 మి.గ్రా వరకు ఫోలిక్‌యాసిడ్ కలుపుతారు. దీంతోపాటు విటమిన్ బి12 కోసం హైడ్రాక్సికోబాలమైన్‌ను ఇంతే మొత్తంలో కలుపుతారు. అదనంగా జింక్, విటమిన్ ఏ, థయమిన్, రైబోఫ్లావిన్, నియాసిన్, విటమిన్ బి6 పోషకాలు కలుపుతారు.

ఈ బియ్యాన్ని ఆహారంగా తీసుకోవడం ద్వారా మహిళల్లో రక్తహీనత సమస్య ఉండదు. చిన్నపిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇందుకోసమే వీటిని హాస్టళ్లు, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకాల్లో పంపిణీ చేస్తున్నారు.

# నిధులున్నా.. నిమ్మదించిన పనులు

నకిరేకల్ : రాష్ట్రంలో ఏకైక ప్రభుత్వ నిమ్మ మార్కెట్ నకిరేకల్‌లోనే ఉంది. దీనిని విస్తరించే పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. రాష్ట్రంలో 90 శాతం నిమ్మ విస్తీర్ణం ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే ఉండటం, ఇక్కడి నుంచి నిమ్మకాయలు దేశంలోని వివిధ రాష్ట్రాలకు ఎగుమతి అవుతుండటంతో 2018లో రూ. 3 కోట్ల వ్యయంతో నకిరేకల్‌లో నిమ్మ మార్కెట్‌ను ప్రభుత్వం నిర్మించింది. ఈ మార్కెట్‌లో రైతులకు మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు దీనిని విస్తరించాలని నిర్ణయించారు. గతేడాది రూ. 3.11 కోట్లతో పలు పనులకు పరిపాలనపరమైన అనుమతులు జారీ చేశారు. ఈ పనులకు ఎనిమిది నెలల క్రితం అప్పటి ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేసినా నేటికి పునాది దశను దాటలేదు.

విస్తరణ పనులకు విడుదల కాని నిధులు

నకిరేకల్ వ్యవసాయ మార్కెట్‌కు ఒక శాతం మార్కెట్ ఫీజు, చెక్‌పోస్టుల ఆదాయం, నిమ్మ మార్కెట్ ఆదాయం అంతా కలిపి రూ. 10 కోట్లకు పైగా నిధులు ప్రస్తుతం మార్కెట్ ఖాతాల్లో ఉన్నాయి. నిమ్మ మార్కెట్ విస్తరణ పనులకు మాత్రం పైసా నిధులు విడుదల కావడం లేదని తెలిసింది. రూ. 3.11 కోట్ల పనులకు గాను ఇప్పటి వరకు అసంపూర్తిగా ఉన్న దుకాణ సముదాయం పూర్తిచేసే పనులు, గ్రేడింగ్ షెడ్ల పునాది పనుల మాత్రమే మొదలు పెట్టారు. ఇప్పటి వరకు రూ. 12 లక్షల



విలువైన పనులు చేశారు. వీటికి సంబంధించిన బిల్లులు పంపినా గుత్తేదారుకు డబ్బులు అందకపోవడంతో పనుల్లో పురోగతి లేకుండా పోయింది. నిమ్మ మార్కెట్ అభివృద్ధి పనులకు మంజూరైన నిధులు ఇలా...రైతు విశ్రాంతి గృహం నిర్మాణం: రూ. 37 లక్షలు

ప్రస్తుతం ఉన్న దుకాణ సముదాయం వద్ద సీసీ నిర్మాణం: రూ. 25 లక్షలు కొత్త దుకాణ సముదాయం- కవర్డ్ షెడ్డు మధ్యలో సీసీ రహదారి: రూ. 29 లక్షలునిమ్మ మార్కెట్ ఇన్, అవుట్ గేట్ల వద్ద నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు వరకు 2 సీసీ రోడ్ల నిర్మాణం: రూ. 54 లక్షలు

రెండు నిమ్మ గ్రేడింగ్ గదులు, షెడ్ల నిర్మాణాలకు: రూ. 1.06 కోట్లు

అసంపూర్తిగా ఉన్న దుకాణ సముదాయం పూర్తికి: రూ. 60 లక్షలు

ఉన్నతాధికారులకు విన్నవించాం

సీహెచ్. శ్రీనాథరాజు, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్, నకిరేకల్ నిమ్మ మార్కెట్‌తోపాటు ప్రధాన మార్కెట్‌లో గుత్తేదారులు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు పంపించాం. నిధులు ఇంకా విడుదల కాలేదు. దీని వల్ల పనుల పురోగతిపై ప్రభావం పడనుందని, ఇక్కడి పరిస్థితులను మా శాఖ పై అధికారులకు విన్నవించాం. పనులు గడువులోగా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

# కొనుగోలుదారుల చేతివాటం.. తూకంలో మోసం

భానుపురి : ఆత్మకూర్(ఎస్) మండలానికి చెందిన ఓ రైతు ట్రాక్టర్‌లో పత్తి లోడ్ చేసుకొని సూర్యాపేటలోని వే బ్రిడ్జి వద్ద కాంటా వేశారు. 15 క్వింటాళ్ల తూకం వచ్చింది. బాలెంలోని జిన్నింగ్ మిల్లులో కొనుగోలుదారులు తూకం వేయగా 14.10 క్వింటాళ్లే వచ్చింది. 90 కిలోల వరకు తూకం తగ్గడంతో రైతు అయోమయానికి గురయ్యారు. మరోచోటుకు వెళ్లే వీలులేక అక్కడే విక్రయించి రూ. 6318 నష్టభారంతో వెనుదిరిగారు. జిల్లాలో పత్తి రైతులకు మద్దతు ధర కలగా మారింది. సాగు మొదలుకొని పంట విక్రయం వరకు అవస్థలు పడినా గిట్టుబాటు కావడం లేదు. సీసీఐ ప్రకటించిన మద్దతు ధర ఇవ్వకుండా కొనుగోలుదారులు(మిల్లర్లు) మోసాలకు పాల్పడుతున్నారు. ప్రైవేటు వ్యాపారులు ధరల్లో, తూకంలో మోసం చేస్తున్నా పట్టించుకునే వారు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

క్వింటాకు ఆరు కిలోల కోత

జిల్లాలో ఈ సారి 80,869 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేపట్టారు. దూది కొనుగోలుకు సీసీఐ ఆధ్వర్యంలో జిల్లాలో ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిల్లో ప్రధానంగా సూర్యాపేట మండలంలోని బాలెంల గ్రామానికి వివిధ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది రైతులు పత్తి తీసుకొచ్చి విక్రయించారు. ఇప్పటి వరకు ఇక్కడ సీసీఐ కొనుగోళ్లు చేపట్టింది. వారి లక్ష్యం మేరకు కొనుగోళ్లు పూర్తికావడంతో కేంద్రాన్ని మూసివేసింది. ప్రస్తుతం జిన్నింగ్ మిల్లర్లు మాత్రమే కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మద్దతు ధర తగ్గించడంతోపాటు తూకాల్లోనూ మోసాలకు పాల్పడుతున్నారు. బయట వేబ్రిడ్జికి, బాలెంలలోని వేబ్రిడ్జికి క్వింటాకు ఆరు కిలోలు చొప్పున తక్కువగా వస్తోందని, 20 క్వింటాలు తీసుకొస్తే



ఒక క్వింటాకుపైగా పత్తిని కోల్పోవాల్సి వస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటు పంట దిగుబడి రాక.. అటు కొనుగోలుదారుల చేతిలో రైతులు మోసానికి గురై నష్టాలు చవిచూసి కన్నీరు పెడుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో వేబ్రిడ్జిలను తనిఖీ చేసి మోసాలను అరికట్టాలని, మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు

-నాగేశ్వరశర్మ, జిల్లా మార్కెట్ అధికారి, సూర్యాపేట

బాలెంలలో మిల్లర్లు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు మా దృష్టికి రాలేదు. పరిశీలించి మోసాలకు పాల్పడుతున్నట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. రైతులు ఈ విషయమై ఫిర్యాదు చేయాలి.

# నాడు కాసులు... నేడు కేసులు

జగిత్యాల : నాడు కాసుల కోసం కక్కుర్తి పడిన వారు నేడు కేసులతో కటకటాలపాలవుతున్నారు. కళ్ల ముందు జరిగేది తప్పిదమని తెలిసినా.. అక్రమాల వైపు నిల్చున్న వారంతా అరెస్ట్ అవుతున్నారు. కరీంనగర్ భూదందాల్లో రోజుకో బాగోతం బయటపడుతోంది. మొన్నటి వరకు కార్పొరేటర్లు, వారి భర్తలు దందాలో భాగమై ఇష్టానుసారంగా వ్యవహరించారనే విషయాలు వెలుగులోకి రాగా.. తాజాగా అసలు భూమాయలో కీలకంగా వ్యవహరించిన రెవెన్యూ అధికారుల పాత్రలు వెలుగులోకి వస్తున్నాయి. కొందరు పోలీసు ఉన్నతాధికారుల వ్యవహారాలు రేపో మాపో బహిర్గతమవబోతున్నాయి. కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి నేతృత్వంలోని ఎకనామిక్ అఫెన్స్ వింగ్ (ఈవోడబ్ల్యూ) బృందాలు కూపీ లాగినాకొద్దీ భూమోసాల డొంక కదులుతోంది. పాత్రధారులు, సూత్రధారులుగా వ్యవహరించిన మోసగాళ్ల బండారం కలుగులో ఉన్న ఎలుకల మాదిరిగా బయటకొస్తుంది. రెండు నెలలుగా కొనసాగుతున్న విచారణల పర్వంలో మరికొందరు ప్రమేయాలు మున్ముందు రోజుల్లో బయటపడనున్నాయి. ఇంకెంతమందో..

రెవెన్యూ అధికారుల పాత్రపై కొన్నాళ్లుగా ప్రజల్లో నెలకొన్న భావనలు నిజమవుతున్నాయి. పోలీసులు అరెస్టు చేస్తున్న వారిలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాత్ర స్పష్టంగా కనిపిస్తోంది. కొత్తపల్లి తహసీల్దార్‌గా పని చేసిన ఓ అధికారి బాధితులకు అన్యాయం చేసి పోలీసులకు చిక్కిపోయారు. ఇదే అధికారిపై కొన్ని రోజుల కిందట ఓ భూమోసం కేసులోనూ ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ విషయమై ఆయనకు నోటీసులు జారీ చేసి వాంగ్మూలాన్ని తీసుకున్నారు. ఇది జరిగిన నాలుగైదు రోజుల్లోనే మరో కేసులో సదరు అధికారి అడ్డంగా



దొరికిపోయారు. ఈ అధికారిపై కరీంనగర్ కమిషనరేట్‌కు పదుల సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో విచారణాధికారులే విస్తుపోతున్నారు. జ్యూడిషియల్ రిమాండ్‌లో ఉన్న అధికారిని కస్టడీలోకి తీసుకొని ఇంకొన్ని ఫిర్యాదులపై విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఈయనతోపాటు రెవెన్యూ శాఖలో గతంలో వీఆర్ఏగా పని చేసి ఇప్పుడు వేరే చోట జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న వ్యక్తితోపాటు కలెక్టరేట్‌లో గతంలో విధులు నిర్వర్తించిన మరో ఇద్దరిపై కేసు నమోదవడం రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ధరణి విభాగంలో పొరుగు సేవల్లో పని చేసిన ఓ కంప్యూటర్ ఆపరేటర్‌పై కూడా కేసు నమోదవడంతో అసలు ఈ తరహా భూమోసాల్లో వీరి పాత్ర ఎంతవరకుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు ఈ అధికారికి సహకరించిన ఒకరిద్దరు రెవెన్యూ అధికారుల పాత్రపైనా పోలీసులు దృష్టి సారించారు. ఫిర్యాదుదారులు అందించిన వినతుల్లో ఎక్కువగా ఈ అధికారి ప్రమేయం ఉండటం.. మొత్తంగా భూమి దస్త్రాల విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరించి కబ్జారాయుళ్లకు దాసోహమయ్యారనేది స్పష్టమవుతోంది. ఇంకొంతమంది రెవెన్యూ సిబ్బంది ఆగడాలు త్వరలో వేరే కేసుల్లో తెలిసే అవకాశముంది.

పోలీసులపై చర్యలు..?

పక్కాగా ఆధారాలున్నప్పటికీ.. బాధితుల పక్షాన నిలబడని పోలీసు సిబ్బందిపైనా చర్యలకు సీపీ వెనుకాడటం లేదనేది తెలుస్తోంది. గతంలో ఆయా ఠాణాల పరిధిలో పని చేసిన వారు భూబాధితులతో వ్యవహరించిన తీరుపై స్పష్టమైన ఆధారాల్ని సేకరించినట్లు తెలుస్తోంది. చాలా సందర్భాల్లో బాధితులను గద్దించడంతోపాటు తప్పులున్న వారి పక్షాన నిలబడినట్లు.. ఇందుకోసం దందారాయుళ్లతో కాసుల లబ్ధి పొందారనే విషయాలు కూడా వెలుగులోకి వస్తున్నట్లు సమాచారం. సీపీ ఇటీవల ఒక ఏసీపీ, ముగ్గురు సీఐలు, ఒక ఎస్సైకి ఆయా కేసులకు సంబంధించి పలు విషయాలను తెలుసుకునేందుకు తాఖీదులు అందించారు. ఇప్పటికే ఒకరిద్దరిని విచారించగా.. ఇంకొంతమంది నుంచి వివరాలను సేకరించనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వీరిపై శాఖాపరమైన చర్యలుంటాయా? లేదా కేసుల నమోదు వరకు ఈ వ్యవహారం వెళ్తుందా..? అనేది త్వరలో తెలియనుంది.

# భరోసాతో తక్షణ సాయం

జగిత్యాల : చిన్న పిల్లలపై లైంగిక వేధింపులు, చిత్రహింసల కేసులు ఇటీవల పెరిగిపోతున్నాయి. అత్యాచార కేసులు జిల్లాలో గతేడాది కంటే 16.67 శాతం పెరగటం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి కేసుల్లో తక్షణ సాయం కోసం 'భరోసా' కేంద్రాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రంలో జిల్లాకు ఒకటి చొప్పున కేంద్రం ఏర్పాటు చేస్తుండగా జిల్లాలో ఫిబ్రవరి 6న ప్రారంభించారు. నిరాదరణకు గురైన పిల్లలు, మహిళలకు ఈ కేంద్రంలో తక్షణ వైద్యం, న్యాయ సాయం, సైకో తెరపీ కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. కేంద్రంలో వసతి కల్పించి పోలీసులు, న్యాయ నిపుణులు బాధితులకు అండగా ఉండి నేరస్థులకు శిక్ష పడేలా చూడటమే కాకుండా బాధిత పిల్లలకు కొత్త జీవితం ప్రసాదించేలా చర్యలు తీసుకుంటారు. 14 ఏళ్లలోపు పిల్లలు అత్యాచారం, లైంగిక వేధింపులకు గురైన వారు, మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేయగానే కేసు నమోదు చేసి తక్షణ సాయం కోసం భరోసా కేంద్రానికి పంపుతారు. కేంద్రంలో ముందుగా ఏఎన్ఎం వైద్య సాయం అందిస్తారు. పరిస్థితిని బట్టి మెరుగైన వైద్యం, కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. భరోసా కేంద్రం జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో మహిళా, శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పని చేస్తుంది. సీసీఎస్ సీఐ, హెడ్ కానిస్టేబుల్, మహిళా పోలీసు, ఏఎన్ఎం, బాధితులకు సాయంగా ఉండేందుకు మరో మహిళ, లీగల్ అడ్వైజర్ తదితరులు ఉంటారు. జగిత్యాల జిల్లా కేంద్రం ధరూర్ క్యాంపులోని జిల్లా ఎస్పీ కార్యాలయం పక్కనే ప్రైవేట్ భవనంలో 'భరోసా' కేంద్రం ఏర్పాటు చేశారు. బాధితులను కేంద్రంలో వసతి కల్పించి అన్ని రకాలా అండగా నిలవనున్నారు. తక్షణ సాయం కోసం 100కు డయల్ చేయటం, లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటారు. న్యాయం అందిస్తాం..భరోసా కేంద్రం ఏర్పాటుతో అత్యాచార, నిరాదరణకు గురైన 14 ఏళ్లలోపు ఆడపిల్లలు, మహిళలకు తక్షణ సాయం అందనుంది.

# నిర్వహణ లోపం.. భగీరథ అస్తవ్యస్తం



తాండూరు : మోమిన్‌పేట మండల పరిధిలోని గోవిందాపురంలో మొదట్లో తాగు నీటి సరఫరా బాగానే ఉండేది. రాను రాను అంతంత మాత్రంగానే సరఫరా కావడంతో బావులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని కొందరు మహిళలు తెలిపారు. బావులలో నీటి మట్టం అడుగంటడంతో విద్యుత్తు మోటార్లు బిగించుకొని నీటి అవసరాలను తీర్చుకుంటున్నామని మహిళలు తెలిపారు.

జిల్లాలోని 20 మండలాల పరిధి 566 గ్రామ పంచాయతీల పరిధిలో 974 ఆవాస గ్రామాలున్నాయి. అన్ని గ్రామాలకు తాగునీటిని సరఫరాకు 'మిషన్ భగీరథ' పథకాన్ని అమలుచేస్తున్నారు. ఈ నీరు పూర్తి స్థాయిలో సరఫరా కాకపోవడం, పలు అవాంతరాలతో సగానికిపైగా గ్రామాలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక నీటి వనరులైన బోర్లు, బావుల్లో నీరు అడుగంటిపోవడంతో కష్టాలు పెరుగుతున్నాయి. దీనికి సంబంధించి 'పరిశీలనాత్మక' కథనం.

నిత్యం 100 లీటర్లు అందించాలి

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి మనిషికి నిత్యం 100 లీటర్ల భగీరథ నీటిని అందించాలి. అయితే చాలా గ్రామాల్లో కొందరి ఇళ్లకు కుళాయి నీటి సరఫరా జరిగితే మరికొందరికి కావడంలేదు. దీంతో పబ్లిక్ కుళాయిల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది.

సగం తండాకే సర్దుబాటు

తాండూరు- సంగారెడ్డి రహదారి మార్గంలోని కందనెల్లి తండాలో దాదాపు 150కి పైబడి కుటుంబాలు ఉంటే అందులో సగం ఇళ్లకు మాత్రమే భగీరథ గొట్టాల ద్వారా తాగునీరు సరఫరా జరుగుతోంది. మిగతా కుటుంబాల వారు ప్రధాన రహదారి మార్గం వారగా ఉన్న పబ్లిక్ కుళాయి వద్దకు వెళ్లి బోరు ద్వారా సరఫరా జరిగే నీటిని పట్టుకోవాల్సి వస్తోంది.

ఆదుకుంటున్న డైరెక్ట్ పంపింగ్ బోర్లు

కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో మొత్తం 44 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లోను సరిపడా భగీరథ నీరు రావడం లేదు. కామన్‌పల్లిలో రోజు విడిచి రోజు వస్తున్నాయి. ఇక్కడ ఇంకా నల్లా కనెక్షన్లు ఇవ్వని నివాస గృహాలు ఉన్నాయి. భోజ్యానాయక్ తండాలో నల్లా కనెక్షన్లు ఇంకా ఇవ్వాల్సి ఉంది. కుల్కచర్ల, ఇప్పాయిపల్లి తదితర గ్రామాల్లో పదుల సంఖ్యలో డైరెక్ట్ పంపింగ్ బోర్లు నీటిని ఆయా కాలనీల్లో అందిస్తున్నాయి. ఇప్పాయిపల్లిలో గతం నుంచి భగీరథ నీటికి తోడు డైరెక్ట్ పంపింగ్ బోర్లు ప్రజలను ఆదుకుంటున్నాయి.

ఎవరూ పట్టించుకోవడంలేదు

పల్లెల్లో పర్యవేక్షణ కొరవడింది. మోటార్లు ఆన్‌చేసి మళ్లీ ఆపేయకపోవడంతో గంటల తరబడి పనిచేస్తున్నాయి. నీరు వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వేసవిని దృష్టిలో ఉంచుకుని అధికారులు లీకేజీలు అరికట్టడం, మూతలకు బిరడాలు బిగించడం వంటి పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం- సుబ్రహ్మణ్యం, డీఈఈ, తాగునీటి సరఫరా.

ఎండలు ముదిరితే ఎద్దడి సమస్య తలెత్తే వీలుంది. కాబట్టి ముందస్తు జాగ్రత్తగా, ఎద్దడి నివారణలో భాగంగా ఈనెల 7నుంచి 15వరకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. ఇందులో భాగంగా మిషన్ భగీరథ హెల్పర్లు 24మంది నిరంతరం గ్రామాల్లో తిరుగుతూ సమస్యలు తెలుసుకుటున్నారు. గ్రామాల్లో పర్యవేక్షణ బాధ్యత పంచాయతీలదే. గ్రిడ్‌కు సంబంధించిన సమస్యలు మేం పరిష్కరిస్తాం.

గొట్టాలకే పరిమితం

తాండూరు మండలం 33 గ్రామ పంచాయతీల్లో 5 సంవత్సరాలు దాటినా వందల సంఖ్యలో ఆవాసాలకు తాగునీరు సరఫరా జరగడం లేదు. వెరసి గొట్టాలు నిరుపయోగంగా మారాయి. నియోజకవర్గంలో అత్యధికంగా జనాభా కల్గిన కరణ్‌కోటలో మిషన్ భగీరథ నీటి సరఫరాకు నీలం రంగులోని గొట్టాలను అమర్చారు. వాటికి అనుసంధానంగా ఆన్‌ఆఫ్ సదుపాయంతో కూడిన ఇనుప గొట్టాలను అమర్చాల్సి ఉండగా గుత్తేదారు దాటవేశారు. ఏడాది దాటినా గొట్టాల నుంచి భగీరథ జలాలు సరఫరా కావడం లేదు. దీంతో వందల సంఖ్యలో ఇళ్లకు తాగునీటి సరఫరా జరగడం లేదు.

ప్రధాన సమస్యలు..

పలుచోట్ల దెబ్బతిన్న భగీరథ పైపులు

నిరంతరం లీకేజీలు

ఇళ్లకు అమర్చక వృథాగా పైపులు, గొట్టాలు

ఇదీ పథకం తీరు

ప్రారంభం.. 2018

నిధుల వ్యయం.. రూ.402 కోట్లు

ఉపరితల ట్యాంకులు.. 871

పైప్‌లైన్ల ఏర్పాటు.. 1920.17 కి.మీ.

ఇళ్లకు కనెక్షన్లు.. 1,98,162

ప్రస్తుత పరిస్థితి.. సగానికిపైగా గ్రామాలకు సరఫరా లోపం.

# అందని బిల్లులు.. కార్మికుల అవస్థలు



పరిగి : మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లుల చెల్లింపులో విపరీత జాప్యం జరుగుతోంది. దీంతో రానురాను భోజన నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతోంది. అప్పులు పెరగడంతో దుకాణదారులు నిత్యావసర సరకులు ఇచ్చేందుకు ముందుకు రావడంలేదు. చేసేదిలేక అరకొరగా తీసుకువచ్చి కాలం నెట్టుకొస్తున్నారు. చేతిలో చిల్లిగవ్వ కూడా లేదని దీంతో నిర్వహణ తలకు మించిన భారంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు మూడు నెలలకు సంబంధించిన బిల్లులు సుమారు రూ.3కోట్ల మేరకు పెండింగ్‌లో ఉన్నాయి.

మొత్తం 1030 పాఠశాలలు, 93,151 మంది విద్యార్థులు: వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 1030 పాఠశాలల్లో భోజన పథకం అమలవుతోంది. విద్యార్థులు భోజనం చేస్తున్నారు. ఒక్కో పాఠశాలకు విద్యార్థుల వినియోగ సంఖ్యను బట్టి చెల్లించాల్సి ఉంది. ప్రతినెలా చెల్లిస్తేనే భోజన నిర్వహణ సాఫీగా సాగే అవకాశముంది. బిల్లులు రూ.కోట్లలో పేరుకుపోవడంతో నిర్వాహకులు చేతులెత్తే పరిస్థితి తలెత్తింది. తమకు దుకాణదారులు అప్పుగా సరకులు ఇవ్వడం లేదని వాపోతున్నారు. దీంతో ఏంచేయాలో పాలుపోక పేద కుటుంబాలకు చెందిన వారు సతమతమవుతున్నారు.

పప్పు. నీళ్ల చారుతోనే నెట్టుకొసున్నారు: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల నుంచి హాజరవుతున్న వారే అధికంగా ఉంటున్నారు. ఇలాంటి వారికి భోజన పథకం నిజంగా ఒక వరంలాంటిదే. గుడ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పు, సాంబారుతో కూడిన పోషకాహార భోజనాన్ని అందించి వారి ఆరోగ్య స్థితిగతులను మెరుగుపరచడం, హాజరుశాతాన్ని పెంచడం ఇందులో భాగం. ఇది సవ్యంగా కొనసాగుతున్నప్పటికీ బిల్లులు పెండింగ్‌లో పడుతున్న సమయాల్లో ప్రభావం పోషకాహారంపై స్పష్టంగా పడుతోంది. దీంతో ఎక్కువ పాఠశాలల్లో పప్పు, నీళ్లచారుతోనే కాలం గడుపుతున్నారు. మునుపటి మాదిరిగా తాము కడుపు నిండా భోజనం చేయలేకపోతున్నామని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డబ్బులిస్తేనే సరకులు ఇస్తామంటున్నారు.

- బోయిని మంగమ్మ, నిర్వాహకురాలు, దోమ.

దోమ మండలం, దాదాపూర్ పాఠశాలలో వంటకు నెలకు రూ.60వేల వరకు ఖర్చు చేస్తున్నాం. దుకాణదారులు పాత బకాయిలు ఇస్తే సరకులు ఇస్తామంటున్నారు. నాలుగు నెలలుగా రూ.2లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. డబ్బులు లేవు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

త్వరలోనే వస్తాయి: హరిశ్చందర్, విద్యాధికారి

వివిధ కారణాలతో బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతోంది. పెండింగ్ బిల్లులు త్వరలోనే అందనున్నాయి. ఏజెన్సీలతో మాట్లాడి పోషకాహార లోపం లేకుండా పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నిర్వాహకులు ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదు.

# అంతటా వరి సాగే

జగిత్యాల : నీటి లభ్యతతో ఉమ్మడి జిల్లాలో ఈ యాసంగిలోనూ వరి ప్రధానపంటగా నిలిచింది. నవంబరు నుంచి ఫిబ్రవరి 15 వరకు రైతులు పెద్దఎత్తున వరినాట్లు వేయగా విస్తీర్ణం రీత్యా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉమ్మడి నల్గొండ జిల్లా తరువాత రాష్ట్రంలోనే రెండోస్థానంలో నిలిచినట్లు వ్యవసాయశాఖ తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సాధారణంకన్నా 24 శాతం వరకు అధిక వర్షపాతం నమోదు, భూగర్భ జలమట్టం కనిష్ఠస్థాయిలోనే ఉండటం, ఆయకట్టుకు శ్రీరామసాగర్, ఎల్ఎండీ తదితర ప్రాజెక్టు నీటిని విడుదల చేయటం, వరదకాలువలో నీటినిల్వ తదితర కారణాలతో రైతులంతా వరిసాగుకే మళ్లారు. ఇతర పంటలకు కూలీల కొరత, వన్యప్రాణులు, కోతుల బెడద, ఉత్పత్తులకు మార్కెటింగ్ సమస్య, కనీస మద్దతు ధర, ప్రభుత్వ సేకరణ లేకపోవటం తదితర కారణాలతో మెజారిటీ రైతులు వరివైపే మొగ్గారు. 2022లో యాసంగిలో 6.64 లక్షల ఎకరాల్లోనే రైతులు వరిని సాగుచేయగా నిరుడు 9.33 లక్షల ఎకరాల్లో, ఈ యాసంగిలో 9.15 లక్షల ఎకరాల్లో వరిని సాగు చేయటం వరిసాగు జోరును వెల్లడిస్తోంది. చివరికి అందని నీరు నాలుగు జిల్లాల్లోనూ మక్క, నువ్వు, ఆవాలు, జొన్న, సజ్జ, వేరుసెనగ, అలసంద, కంది, పెసర, మినుము, ఆయిల్‌పామ్, కూరగాయలు తదితర పంటలను విత్తుకున్నారు. వరిపంటను అధిక విస్తీర్ణంలో సాగుచేయగా ఎండవేడిమి పెరగటంతో భూగర్భ జలమట్టం తగ్గి నీటితడులు సమస్యగా మారగా చివరి ఆయకట్టుకు ఆశించినట్లు కాలువనీరు వెళ్లటంలేదు. రాత్రి చలి, పగటిపూట ఎండవేడిమితో పోషకలోపాలు, చీడపీడల సమస్యకూడా పెరిగి వరి రైతులు పలుమార్లు సస్యరక్షణ చర్యలను చేపట్టాల్సివచ్చి తల్లడిల్లుతున్నారు. మరోవైపు ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోసే వీలు లేకపోవటంతో ఎస్సారెస్పీపైనే భారం పడినా నీటినిల్వ తగ్గటం ఆందోళనకరంగా మారింది. ఈ నేపథ్యంలో విద్యుత్, సాగునీరు, చీడపీడల సమస్యను అధిగమించి ధాన్యాన్ని సగటుస్థాయిలో ఉత్పత్తి చేయటం రైతులకు సవాలుగా మారింది. ఇప్పట్నుంచి విద్యుత్, సాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటేనే పంటను సజావుగా పూర్తిచేయగలుగుతారు.

# పడిపోయిన భూగర్భ జలాలు

కోనరావుపేట: ఈ ఏడాది ఆశించిన స్థాయిలో భూగర్భ జలాలు ఉండటంతో రైతులు యాసంగిలో వరి సాగు చేశారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారు. భానుడి ప్రతాపంతో భూగర్భ జలాలు ఒక్కసారిగా పాతాళానికి పడిపోవడంతో బోరు, వ్యవసాయ బావులు వట్టిపోతున్నాయి. దీంతో వరి పంట పొట్ట, వరి కంకులు వేసే దశలో ఎండిపోతోంది. కళ్లెదుటే ఎండిపోవడంతో కాపాడుకోవడానికి అన్నదాతలు నానా తంటాలు పడుతున్నారు. కొత్తగా బోర్లు తవ్వడం, బావుల్లో పూడిక తీయడం వంటి పనుల్లో నిమగ్నయ్యారు. అయినప్పటికీ ఆశించిన మేర నీరు లభించక, పంట చేతికొచ్చే పరిస్థితి కనిపించక ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో ఈ ఏడాది యాసంగిలో 1.78 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. గత యాసంగితో పోలిస్తే ఈ ఏడాది సుమారు 10 వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది. గత అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు ఒర్రెలు, వాగులు, చెరువులు నీటితో కళకళలాడాయి. అప్పటి నుంచి అంటే అయిదు నెలలుగా వర్షం పడలేదు. దీంతో అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాలపై ఆధారపడి వరిసాగు చేశారు. గత ఏడాది ఫిబ్రవరిలో 7.9 మీటర్ల మేర భూగర్భ జలాలు ఉండగా, ఈ ఏడాది 10.18 మీటర్లలో ఉన్నాయి. గతంతో పోలిస్తే సుమారు 2 రెండు మీటర్ల లోతుకు వెళ్లిపోయాయి. పైగా వేసవి ఎండలు మార్చి నుంచే పెరిగాయి. భానుడి ప్రతాపంతో పొట్ట, కంకులు వేసే దశలో ఉన్న వరి పంట కళ్లెదుటే ఎండిపోతుండగా, కాపాడుకోవడానికి అన్నదాతలు భగీరథ యత్నం చేస్తున్నారు. భారీగా ఖర్చు పెట్టి కొత్తగా బోర్లు తవ్వుతున్నారు. కొందరు బావుల్లోని పూడిక తీయిస్తున్నారు. తద్వారా బావుల్లో నీటి ఊటలు పెరుగుతాయని భావిస్తున్నారు. పంటను కాపాడుకోవటానికి నానా తంటాలు పడుతున్నారు. సాగుకు, చీడపీడల నివారణకు, బావుల మరమ్మతుకు చేసిన పెట్టుబడులు తిరిగిరాని దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, కుంటలు, వాగుల్లో నీరు వట్టిపోవడంతో భూగర్భ జలాలు మార్చి చివరి నాటికి 15 మీటర్ల మేర పడిపోయే అవకాశం ఉందని భావిస్తున్నారు.

రూ.35 వేలతో బోరుబావి తవ్వకంనాకున్న రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేశాను. గత ఏడాది పూర్తిస్థాయిలో పంట చేతికందింది. ఈ



ఏడాది పొట్టదశలో ఉండగా బావిలో నీరు తగ్గింది. ఎకరం మేర నీరు పారుతుండగా మిగిలిన ఎకరన్నరం ఎండిపోయే ప్రమాదం నెలకొంది. వ్యవసాయ బావిలో పూడిక తొలగింపునకు రూ.25 వేలు, బావిలో సైడ్ బోరుబావి తవ్వకానికి రూ.35 వేలు ఖర్చు అయింది. వరిసాగుకు రూ.50 వేలు పెట్టుబడి పెట్టగా మొత్తం రూ. 1.10 లక్షల ఖర్చు అయింది.

తాళ్లపల్లి లక్ష్మీరాజం, రైతు, ధర్మారంనీరు లేక...నాకున్న ఆరు ఎకరాల్లో వరిసాగు చేశాను. గత ఏడాది అన్నపూర్ణ ప్రాజెక్టు నుంచి అనంతారం చెరువు మత్తడి నీరు బిక్కవాగు మీదుగా గ్రామంలోని పెద్ద చెరువుకు తరలించడంతో పూర్తిస్థాయిలో పంట దిగుబడి వచ్చింది. ఈ ఏడాది యాసంగిలో అన్నపూర్ణ రిజర్వా యర్ నుంచి నీరు చెరువులోకి రాకపోవడంతో బావిలో నీరు వట్టిపోతుంది. మూడు ఎకరాలకు పైగా వరి పంట కంకులు వేసే దశలో ఎండిపోతుంది. సాగుకు రూ.1.4 లక్షల వరకు పెట్టుబడి వ్యయమైంది. ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించి ఆదుకోవాలి.

ఎనుగుల నర్సయ్య, రైతు, రహీంఖాన్‌పేట

# మంటలిక్కడ.. అధికారులు ఎక్కడ?

సిరిసిల్ల : వన్యప్రాణులు, విలువైన వృక్ష సంపద, ఎన్నో ప్రకృతి అందాలకు ఆవాసమే అడవులు. జీవరాశుల సమతుల్యతలో ప్రత్యక్షంగా వీటి పాత్ర కీలకం. అనేక ఫలాలను అందిస్తున్న వనాలు మంటల్లో చిక్కుకుంటున్నాయి. వేసవిలో రాలిన ఆకులు కాలి అప్పుడే ఎదుగుతున్న మొక్కలు బొగ్గవుతున్నాయి. బెదురుతున్న అటవీజంతువులు ఆవాసాలు కోల్పోతున్నాయి. అక్కడక్కడా వేటగాళ్లకు చిక్కి హతమవుతున్నాయి. జిల్లాలో 27 వేల హెక్టార్‌లకు పైగా అటవీ విస్తీర్ణం ఉంది. వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి, ముస్తాబాద్ మండలాల్లో అత్యధికంగా విస్తరించాయి. రెండు అటవీ క్షేత్రాల పరిధిలో 12 సెక్షన్లు, 44 బీట్‌లు ఉన్నాయి. నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేట జిల్లా అడవులను కలుపుకుని ఉన్నాయి. జిల్లాలోని అటవీ ప్రాంతంలో కొన్ని వృక్షజాతులు మినహా వేసవిలో ప్రధానంగా చాలా రకాల చెట్లు ఆకులు రాల్చేవి. రాలిన ఆకుల కారణంగా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకూడదన్న ఉద్దేశంతో అటవీశాఖ ఆధ్వర్యంలో అగ్గిరేఖలు ఏర్పాటు చేస్తుంటారు. నిర్ణీత కొలతల ప్రకారం వేసిన ఫైర్‌లైన్ ఏర్పాటు చేస్తే మంటలు విస్తరించకుండా అడ్డుకుంటాయి. అయితే వీటి జాప్యం కారణంగా నిత్యం వనాల్లో మంటలు ఎగిసిపడుతున్నాయి. ఫిబ్రవరిలో 70 శాతం వరకు ఆకులు రాలాయి. అప్పుడే అగ్గిరేఖలు ఏర్పాటు చేసి ఉంటే చాలా వరకు ప్రమాదాలను నియంత్రించే అవకాశం ఉండేది. జాప్యం కారణంగా చందుర్తి, రుద్రంగి, ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట, గంభీరావుపేట వీర్నపల్లి మండలాల్లోని అడవుల్లో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి.

ముందస్తు చర్యల్లేక...

మరో పక్షం రోజుల్లో ఇప్పపువ్వు, తునికాకు సేకరణ ప్రారంభమవుతుంది. వృక్షాల కింద చిత్తడిగా ఉన్న ఆకుల్లో వీటిని ఏరడానికి సమయం పడుతుంది. ఇప్పపువ్వును పశువులు సైతం ఇష్టంగా తింటాయి. వీటితో ప్రయోజనం పొందే వ్యక్తులు వనాలకు అగ్గిపెడుతున్నారు. ఇలా మొదలైన మంటలు ఇతర ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. అప్పుడే జన్మించిన జంతువులు, పక్షుల పిల్లలు వేడికి హతమవుతున్నాయి. వనాల్లో నాటిన హరితహారం మొక్కలు సైతం దగ్ధమవుతున్నాయి. విస్తరించే మంటలను అదుపు చేసేందుకు అత్యాధునిక సాంకేతికత అందుబాటులో ఉంది. శాటిలైట్ ద్వారా ప్రమాద ప్రదేశానికి సంబంధించిన సందేశం ఆ శాఖ అధికారులకు అందుతుంది. బలమైన గాలులు వీచే యంత్రాలతో సిబ్బంది మంటలను నియంత్రించాలి. కానీ చాలా చోట్ల ఎగిసిపడే మంటలను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉండగా, ఇందుకు సిబ్బంది కొరత తోడయ్యింది. దట్టమైన పొగలో ఆర్పలేమని వదిలేయడంతో అడవంతా కాలిపోతుంది. ముందస్తు చర్యలు చేపట్టి ఉంటే ప్రమాదాలు తగ్గి నష్టం కొంత తగ్గి ఉండేదని స్థానికులు భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# కేంద్ర ఎన్నికల సంఘానికి ఇద్దరు కొత్త కమిషనర్లు




న్యూఢిల్లీ: భారత ఎన్నికల సంఘానికి కొత్తగా ఇద్దరు కమిషనర్ల నియామకమయ్యారు. కేంద్ర ఎన్నికల కమిషనర్లుగా కేరళకు చెందిన మాజీ ఐఏఎస్ జ్ఞానేష్‌కుమార్, పంజాబ్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ సుఖ్‌భీర్ సింగ్ సంధును ఎంపిక చేశారు. కాగా గత నెలలో ఎన్నికల కమిషనర్ అనుప్ చంద్ర పాండే పదవీ విరమణ చేయగా, ఇటీవల అరుణ్ గోయల్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో రెండు ఎన్నికల కమిషనర్ పోస్టులు ఖాళీ అయిన సంగతి తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడానికి ఇంక కొన్ని రోజులే ఉందనగా కేంద్ర ఎన్నికల సంఘంలో ఇద్దరు కమిషనర్ల రాజీనామాతో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఒక్కరే ఈసీఐలో మిగిలారు. దీంతో తాజాగా ఇద్దరు కమిషనర్లను సెలక్షన్ కమిటీ నియమించింది. కాగా జ్ఞానేష్‌కుమార్.. 1988 బ్యాచ్ కేరళ కేడర్‌కు చెందిన ఐఏఎస్ మాజీ అధికారి. ఆర్టికల్ 370 రద్దు సమయంలో కేంద్ర హెూం శాఖ వ్యవహారాల తరఫున కశ్మీర్ డివిజన్‌ను పర్యవేక్షించారు. గతంలో పలు కేంద్ర మంత్రిత్వ శాఖలకు కార్యదర్శిగా పనిచేశారు.

చదవండి: పంజాబ్ లోక్‌సభ 'ఆప్' అభ్యర్థుల జాబితా విడుదల ఈ సెలక్షన్ కమిటీలో ప్రధానమంత్రితో పాటు ఓ కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా, లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి కూడా ఉన్నారు. గురువారం ప్రధాని మోదీ అధ్యక్షతన ఎలక్షన్ కమిషన్ భేటీ అయ్యింది. అనంతరం న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్, హెూంశాఖ కార్యదర్శి, శిక్షణ వ్యవహారాలశాఖ కార్యదర్శి సభ్యులుగా ఉన్న సెర్చ్ కమిటీ ప్రతిపాదించిన పేర్ల జాబితాపై చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక రాజీవ్ కుమార్ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పదవీ విరమణ చేయనున్నారు.

సెలక్షన్ కమిటీలో సభ్యుడైన కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చైదరి.. కేంద్రంపై మండిపడ్డారు. భారత ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర మంత్రిని నియమించడం సరైంది కాదని అన్నారు. ఈ కమిటీలో సీజేఐ ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. గత రాత్రి తనకు 212 పేర్లను పంపించారని, మళ్లీ సమావేశానికి 10 నిమిషాల ముందు ఆరుగురు పేర్లను చెప్పారని అన్నారు. ప్యానెల్‌లో ప్రభుత్వానికే మెజారిటీ ఉందని.. వారు కోరుకున్నదే జరుగుతుందన్నారు.



# రాములోరి ముత్యాల తలంబ్రాల్ని సీఎం రేవంత్ తెస్తారా? లేదా?

హైదరాబాద్ : రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆలయాలు ఎన్నో ఉన్నప్పటికీ.. భద్రాచలం రామలోరి ఆలయం లెక్క కాస్త వేరు. ప్రతి ఏటా శ్రీరామనవమి వేళ.. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వారు కుటుంబ సమేతంగా స్వామివారి కల్యానానికి ప్రభుత్వం తరఫున ముత్యాల తలంబ్రాల్ని, పట్టువస్త్రాల్ని తీసుకెళ్లటం ఆనవాయితీగా వస్తున్న సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రిగా కేసీఆర్ పదేళ్లు పదవిలో ఉన్నప్పటికి శ్రీరామనవమి సందర్భంగా ముత్యాల తలంబ్రాల్ని తీసుకెళ్లిన సందర్భాలు వేళ్ల మీద లెక్కించే పరిస్థితి. అందుకు భిన్నంగా తాజా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ముత్యాల తలంబ్రాల్ని రాములోరి కల్యాణానికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే.. ఆయనకు ఎన్నికల కోడ్ అడ్డు పడనుంది. ఈ నెల 17న శ్రీరామ నవమి అన్న సంగతి తెలిసిందే. అయితే.. పదిహేనో తేదీ నాటికి లోక్ సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది. అదే జరిగితే.. ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ వర్తించదు. ఈ నేపథ్యంలో శ్రీరామనవమి వేళ.. ముత్యాల తలంబ్రాలతో ముఖ్యమంత్రి వస్తారా? లేరా? అన్నదిప్పుడు ఆసక్తికరంగా మారింది. అయితే.. ఈసారి జరిగే రాములోరి కల్యాణానికి ముఖ్యమంత్రి హెూదాలో రేవంత్ హాజరుకావాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి అడ్డుగా ఉన్న ఎన్నికల కోడ్ విషయమై ఎన్నికల అధికారుల నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోవాలన్న ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రయత్నాలు మొదలైనట్లుగా చెబుతున్నారు. శతాబ్దాలుగా ఆనవాయితీగా ఉన్న అంశానికి సంబంధించి ఎన్నికల కోడ్ ను వర్తింపచేయకుండా అనుమతి ఇవ్వాలని ఎన్నికల సంఘానికి ప్రభుత్వం తరఫున విన్నవించుకోనున్నట్లు చెబుతున్నారు. ఈ వినతికి ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందిస్తే సీఎం రేవంత్ భద్రాచలానికి ఖాయంగా వెళతారని తెలుస్తోంది. ఒకవేళ అనుమతి రాకుంటే ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ కమిషన్ తో పాటు ముఖ్యమైన అధికారులు ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తారు.

# డాక్టర్ సుధాకర్‌రావు భౌతికకాయానికి నివాళులర్పించిన హరీశ్ రావు



హైదరాబాద్: చెన్నూరు మాజీ శాసనసభ్యులు, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ మాజీ చైర్మన్ డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్ రావు భౌతిక కాయానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో ఉన్న పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. గత కొన్నాళ్లుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న ఆయన బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఆయన అంత్యక్రియలు మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం వడ్డే కొత్తపల్లిలో నిర్వహించారు. కాగా, మాజీ ఎమ్మెల్యే, ఎండోక్రైనాలజిస్ట్‌గా అంతర్జాతీయ గుర్తింపు పొందిన డాక్టర్ నెమురుగొమ్ముల సుధాకర్‌రావు స్వస్థలం మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని వడ్డేకొత్తపల్లి. 1974 లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన ఆయన 1984లో డీఎం పట్టా అందుకున్నారు. ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఉద్యోగం ప్రారంభించి, గాం ధీ మెడికల్ కాలేజీలో ఎండోక్రైనాలజీ విభాగం అధిపతిగా 1999లో రిటైర్ అయ్యారు. ఆ తర్వాత పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో వివిధ హెూదాల్లో కొనసాగి వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని 8 పరిశోధన పత్రాలను ప్రచురించారు. జాతీయ, అం తర్జాతీయ వైద్యుల సొసైటీల్లో సభ్యుడిగా ఉన్న ఆయనకు 2014లో ఎండోక్రైనాలజీ విభాగంలో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు, 2016లో డయాబెటిక్ విభాగంలో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులు వరించాయి. సుధాకర్‌రావు తండ్రి యతిరాజారావు ఉమ్మడి ఏపీలో ఏడుసార్లు ఎమ్మెల్యేగా పని చేశారు. 1999 నుంచి 2003 వరకు ఎమ్మెల్యేగా ఉన్న సుధాకర్ రావు అంచనాల కమిటీ సభ్యుడిగా, ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్‌గా వ్యవహరించారు. నిరుడు ఆగస్టు 14న ఆయనను ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్‌గా నాటి సీఎం కేసీఆర్ నియమించారు.

# బీజేపీకి షాక్.. కాంగ్రెస్‌లోకి జితేందర్ రెడ్డి.. అదే కారణమా



హైదరాబాద్: రాష్ట్ర బీజేపీకి బిగ్ షాక్ తగిలింది. ఎంపీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ టికెట్ ఆశించిన మాజీ ఎంపీ జితేందర్ రెడ్డికి బీజేపీ మొండి చేయి చూపడంతో ఆయన కాంగ్రెస్‌లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో జితేందర్ గురువారం సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చర్చలు జరిపిన అనంతరం కాంగ్రెస్‌లోకి రావడానికి ఆయన సుముఖత వ్యక్తం చేశారు. బీజేపీ నుంచి మహబూబ్ నగర్ ఎంపీ టికెట్ ఆశించిన జితేందర్ రెడ్డికి షాక్‌నిస్తూ ఆ టికెట్‌ని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణకు కేటాయించారు. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన జితేందర్ కాంగ్రెస్‌లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

# మోదీ వల్లే భారత్‌కు రెడ్ కార్పెట్ వేస్తున్న ప్రపంచ దేశాలు : ఈటల



హైదరాబాద్: దేశాన్ని అన్ని రంగాల్లో మోదీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని, ప్రపంచ దేశాలన్నీ మోదీకి రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలుకుతున్నాయని బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మన్సూరాబాద్- బండ్లగూడ రోడ్డులోని మహవీర్ హరిణ వనస్థలి పార్కులో మార్నింగ్ వాకర్స్‌తో సమావేశం నిర్వహించారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలవాలని వాకర్స్‌ను కోరారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. మరోసారి మోదీ ప్రభుత్వమే రావాలని దేశమంతా కోరుకుంటుందని, రాష్ట్రంలోనూ మెజారిటీ సీట్లు బీజేపీయే గెలుచుకోబోతుందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి సురేందర్‌నాథ్‌యాదవ్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

**ముఖ్యకార్యకర్తలతో సమావేశం..** ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన ఈటల రాజేందర్ మాట్లాడుతూ డిజిటల్ విప్లవాన్ని ప్రతి సామాన్యుడికి అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత మోదీదేనన్నారు. మూడో సారి ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా ప్రజలు తమ ఓటు హక్కుతో ఆశీర్వదించాలన్నారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, కళ్లెం రవీందర్‌రెడ్డి, వనిపల్లి శ్రీనివాసరెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, నర్సింహగుప్తా, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్, నవజీనవ్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

# దయచేసి కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయండి.. సీఎం రేవంత్‌కు మండవ లేఖ



హైదరాబాద్, మార్చి 14: కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు లేఖ రాశారు. సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన అన్ని కులాల సంక్షేమం కోసం కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలన్న నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. కమ్మవారు చట్టపరంగా అగ్రవర్ణమే అయినా.. ఆ కులంలో మెజారిటీ ప్రజలు పేదరికంలో మగ్గిపోతున్నారన్నారు. అగ్రవర్ణమైన కమ్మవారిలో కూడా ఆర్థికంగా వెనుకబడి, పూటగడవని వారు ఎందరో ఉన్నారని తెలిపారు. పిల్లల చదువులకు ఫీజులు కట్టలేక.. మెరిట్ ఉన్నా ఆర్థిక ఇబ్బందులతో మధ్యలోనే చదువులు ఆపేస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు లేక, స్వయం ఉపాధికి ఆర్థిక పరిస్థితి సహకరించక ఇబ్బందులు పడుతున్న వాళ్లు ఉన్నారని చెప్పారు. ఈ నేపథ్యం పేద కమ్మ వారిని ఆదుకునేందుకు మిగతా కులాల మాదిరిగానే "కమ్మ సంక్షేమ కార్పొరేషన్" ఏర్పాటు చేయాలని కోరారు. కమ్మవారి సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసిన తొలి ముఖ్యమంత్రిగా మీ పేరు ఉండిపోతుందన్నారు. తక్షణం కమ్మ కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నానని మండవ వెంకటేశ్వరరావు లేఖలో పేర్కొన్నారు.

# యాదగిరిగుట్టలో పీటల వివాదంపై అధికారుల అలర్ట్

యాదాద్రి : యాదాద్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖకు చిన్న పీటలు వేసి అవమానించారంటూ వివాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో యాదగిరిగుట్ట ఆలయంలో పీటల వివాదంపై అధికారుల అలెర్ట్ అయ్యారు. ప్రతిపక్షాలకు పీటల వివాదం ఓ ఆయుధంగా కూడా మారింది. దీంతో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యాదగిరిగుట్ట దేవస్థాన అధికారుల అప్రమత్తమయ్యారు. వెంటనే పది సమాంతర పీఠలను ఆలయ సిబ్బంది కొనుగోలు చేసింది. పాతవి 4, కొత్తవి 10 పీటలతో సహా ఒకేసారి 14 మంది వీవీఐపీలకు వేద ఆశీర్వచనం చేసేలా దేవస్థాన అధికారులు చర్యలు చేపట్టింది.





# 10వ తరగతి విద్యార్థులకు తెలంగాణ సర్కార్ శుభవార్త



10వ తరగతి విద్యార్థులకు తెలంగాణ సర్కార్ శుభవార్త చెప్పింది. కొంత కాలం నుంచి అమలులో ఉన్న నిమిషం నిబంధనను ఎత్తివేసింది. పరీక్షా కేంద్రానికి హాజరయ్యేందుకు 5 నిమిషాల గ్రేస్ టైం ఇచ్చింది. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు కాస్త టెన్షన్ లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి ప్రారంభంకానున్నాయి. ప్రకటించిన గ్రేస్‌టైమ్ కారణంగా విద్యార్థులను ఉదయం 9.35 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నారు. కాగా మార్చి 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660